క్లుప్తంగా

నివాళి



సుబ్రమణ్యంరెడ్డికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: మండలంలోని గొల్లపాళెంకు చెందిన వైఎస్సార్ సీపీ నేత పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి తండ్రి సుబ్రమణ్యంరెడ్డికి శుక్రవారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. సుబ్రమణ్యంరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రామ్‌కుమార్‌రెడ్డి గొల్లపాళెం గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్రమణ్యం రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

రాపూరు : మండలంలోని కండలేరు గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. 5వ తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్‌కు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరైయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో అరగంట ముందు కేంద్రానికి రావాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్ : రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సిద్దారెడ్డి హరినాథ్‌రెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్ సహకారంతో ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం అందజేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆడిటర్ కంటి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, బలరాంరెడ్డి, డాక్టర్లు రాజా, చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 9.475 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 9.475 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 600 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 10, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 160 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి

కోట : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చేవూరు నాగేశ్వరరావును శుక్రవారం కోటలోని ఆయన నివాసంలో పార్టీ సీఈసీ సభ్యుడు, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి పరామర్శించారు. అనారోగ్యం బారిన పడిన నాగేశ్వరరావు చికిత్స తీసుకుని ఇంటిలో ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ధనుంజయరెడ్డి గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కోటారెడ్డి, సుబ్రమణ్యం, నాగూర్‌యాదవ్ పాల్గొన్నారు.

14న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వెంకటగిరి రూరల్ : ఈ నెల 14న మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ అబ్దుల్‌రషీద్ తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్

గూడూరు రూరల్ : స్థానిక కోర్టు సెంటర్‌లో ఉన్న ఒక కూల్ డ్రింక్ షాపులో 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ రమేష్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. కూల్ డ్రింక్ షాపు యజమాని షేక్ నూరుల్లాను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఈబీ డీటీఎఫ్ ఎస్ఐ మోసెస్, సిబ్బంది కిరణ్‌సింగ్, రమేష్, ఆనంద్, బాబు, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



జంగాలపల్లిలో కలిశ గ్రామోత్సవం చేస్తున్న నిర్వాహకులు



సైదాపురం: సిద్ధలయ్య కోనలో ప్రత్యేక అలంకరణలో స్వామి



కలువాయి శివాలయంలో స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు



తడ: తడకండ్రిగ శివాలయంలో భక్తుల సందడి



భక్తులతో పోటెత్తిన శివాలయాలు

గూడూరు రూరల్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణ, రూరల్ పరిధిలోని శివాలయాలు శుక్రవారం వేకువ జాము నుంచే భక్తులతో పోటెత్తాయి. గూడూరులోని శ్రీమూలస్థానేశ్వరస్వామి ఆలయం, పటేల్ వీధిలోని సాయి సత్సంగ నిలయంలో భారీ శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు. త్యాగరాజువీధిలోని సోమేశ్వరాలయం, నరసింగరావుపేటలో ఉన్న ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 88వ త్రిమూర్తి శివ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవరత్నాల, అభిషేక, రుద్రాక్ష శివలింగాలను ఏర్పాటు చేశారు. చెన్నూరు, తిప్పవరప్పాడు, నెల్లటూరు గ్రామాల్లో ఉన్న శివాయాల్లో రుద్రాభిషేకం, పాలాభిషేకం, లింగోద్భవ పూజలు నిర్వహించారు.

సైదాపురంలో..

సైదాపురం: మండలంలోని శివాలయాలు శుక్రవారం శివనామ స్మరణతో మారుమోగాయి. మహా శివరాత్రి సందర్భంగా సైదాపురంలోని శివాలయం, సిద్ధలయ్య కోనలో విశేష పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా ఊటుకూరు, తురిమెర్ల, గిద్దలూరు, కలిచేడు గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో శివార్చన చేశారు. శివపార్వతులకు కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వీరబ్రహేంద్ర స్వామి, బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండలంలోని కల్లూరు, ఉచ్చూరు, శ్రీధనమల్లి, మేలుపాక, అక్కరపాక తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు జాగారం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మేలుపాక, శ్రీధనమల్లి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

ఓజిలిలో..

ఓజిలి: మండలంలోని మానమాల, ఇనుగుంట, నెమళ్లపూడి, ఓజిలి తదితర గ్రామాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

కలువాయిలో..

కలువాయి: మండలంలో శుక్రవారం మహా శివరాత్రి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కలువాయిలోని రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి, యదనపర్తిలోని శ్రీమత్ పార్వతీ సమేత శ్రీకంఠ మల్లేశ్వర స్వామి, బద్దెవోలులోని రాధామాధవ రామలింగేశ్వరస్వామి, కుల్లూరులోని గంగాధరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు కేశారు. రుద్రాభిషేకం, మధ్యాహ్నం కల్యాణం, గ్రామోత్సవం, లింగోద్భవ పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కలువాయి శివాలయంలో శివ భక్తమండలి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్ రెడ్డి పూజల్లో పాల్గొని వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు.



కోట : నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్, ధనుంజయరెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

వాకాడులో..

వాకాడు: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి. పంట్రంగంలోని పురాతన పాండురంగేశ్వరస్వామి, వాకాడులోని నాగేశ్వరస్వామి, జువ్వినట్టులోని కాశీ విశ్వేశ్వరస్వామి, తిరుమూరులోని భీమేశ్వరస్వామి, వెంకటరెడ్డిపాళెంలోని జలసిద్దేశ్వరస్వామి, యరగాటిపల్లిలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి, తూపిలిలోని బ్రహ్మలింగేశ్వరస్వామి, మొలగనూరులోని కాశీ విశ్వనాథస్వామి, కల్లూరు, కొండాపురంలోని భీమేశ్వరస్వామి, దుగ్గరాజపట్నం, తూపిలిపాళెం శివాలయాల్లో స్వామికి విశేష అభిషేకాలు, కల్యాణం, అన్నదానాలు చేశారు. ధర్మకర్తలు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి సముద్ర స్నానాలు ఆచరించి ఆలయ ఆవరణలో పిండి దీపాలు వెలిగించారు. వాకాడు శివాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని వెంకటగిరిలో ఘనంగా జరుపుకున్నారు. కైవల్యా నదీ తీరం వద్ద ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు మత్స్య ముని మహా కాళేశ్వరస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాశీవిశ్వనాథస్వామి, కర్ణకమ్మ వీధిలోని శ్రీదేవి భూదేవి సమేత హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. బంగారుపేట భవాని శంకరాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. జంగాలపల్లిలో వీరభద్రస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. కలిశ గ్రామోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ కుమార యాచేంద్ర వెంకటగిరిలోని కాంపాలెంలోని కామాక్షి ఆలయం, కాశీపేటలోని కాశీవిశ్వనాథ స్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

కోటలో..

కోట : మండలంలో శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. గూడలి కొండపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వరాలయంలో నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి పాల్గొన్నారు. రుద్రాభిషేకం, అన్నదానం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అల్లంపాడులోని అగస్త్యేశ్వరాలయంలో శివరాత్రి వేడుకల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కోట తూర్పువీధిలోని సోమేశ్వరాలయంలో శివరాత్రి వేడుకల్లో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

తడలో..

తడ: మండలంలో శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. తడకండ్రిగలోని భువనేశ్వరి సమేత భువనేశ్వరాలయంలో పాలాభిషేకం చేశారు. అనంతరం స్వామికి చందనాలంకారం చేశారు. నిప్పో పరిశ్రమ యాజమాన్యం అన్నదానం చేసింది. చిన్న మాంబట్టులో వెలసిన గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. టీటీడీ అన్నమాచార్య భక్త బృందం హరికథా కాలక్షేపం నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. వాటంబేడులోని కాశీ విశ్వేశ్వర స్వామి, వేనాడులోని శృంగేశ్వర శ్రీరంగ పెరుమాళ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేట మన్నారుపోలూరు బీసీ కాలనీ సమీపంలో కాళంగినదీ తీరాన వెలసిన సంతానేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి కాళంగినదీ జలాలతో అభిషేకం చేశారు. ఇక్కడ భక్తులు స్వయంగా జలాభిషేకం చేసుకునే అవకాశం ఉంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు మల్లికార్జునస్వామి, బాలాజీ స్వామి పర్యవేక్షించారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : మండలంలో శుక్రవారం మహా శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. పుదూరు సమీపంలో ఉన్న హనుమదీశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలను నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఓసూరు అల్లెయ్య స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. రాత్రి స్వామివారి కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష కాలపూజ, సాముహిక లలితా సహస్రనామార్చన చేపట్టారు. ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్ రెడ్డి, బాలాజి స్వామి పాల్గొన్నారు. బ్రాహ్మణ వీధిలో ఉన్న అన్నపూర్ణేశ్వరీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, అఖిలాండేశ్వరి దేవి సమేత నీలంకఠేశ్వర స్వామి, విన్నమాలలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం అర్ధరాత్రి నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. తిమ్మాజికండ్రి సమీపంలోని దుర్గామల్లేశ్వర స్వామి, మర్లపల్లిలో భ్రమరాంబికాదేవి సమేత మల్లేశ్వరస్వామి తదితర ఆలయాల్లో మహాశివ రాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

వేడుకగా భూపతేశ్వర స్వామి నగరోత్సవం

జువ్వలపాళెం గ్రామం నుంచి భూపతేశ్వర స్వామి నగరోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. అయ్యప్ప స్వామి సేవా సంఘ అధ్యక్షుడు కొప్పాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించి చిట్టమూరు మండలంలోని యాకశిరి తిప్పలోని భూపతేశ్వర స్వామి ఆలయానికి తీసుకెళ్లారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెళ్లకూరులోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలోనూ, చెంబేడు శివపార్వతుల ఆలయంలోనూ, పాలచ్చూరులో నాగార్పమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. రాపూరులో పురాతన రామనాథేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి శివపార్వతుల కల్యాణం చేపట్టారు. ఆకలివలస సమీపంలోని బుగ్గేశ్వర స్వామి, మామిడికోన, సిద్ధిలేశ్వర కోనలో శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

దక్కిలిలో..

దక్కిలి: మండలంలో శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. స్వామి, అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వడ్ల మోపూరు, ఎగువ లింగసముద్రం గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో అభిషేకం, గ్రామోత్సవం, ఆది దంపతుల కల్యాణం, అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. దగ్గవోలు గ్రామంలో ఉన్న నాగలింగేశ్వర స్వామి, వెంబులూరు, మార్లగుంట ఆలయాల్లో అన్నదానం చేశారు. అదేవిధంగా బాలాయపల్లి మండలంలోని చిలమనూరులో ఉన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయంలో మహాశివరాత్ర సందర్భంగా హోమాలు, కలశ స్థాపన, పండరి భజన, అన్నదానం, అగ్నిగుండ మహోత్సవం చేపట్టారు.



మేలుపాకలోని శివాలయంలో ప్రత్యేక అలకరణంలో శివలింగం

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలో శుక్రవారం శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. లింగవరంలో ఉన్న వ్యాఘ్రేశ్వర స్వామి ఆలయంలో వరగలికి చెందిన యరటపల్లి జానకిరామిరెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. అలాగే మోమిడిలోని కాట కోటేశ్వర స్వామి, ఏరూరులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత మల్లికార్జున స్వామి, తూర్పుకనుపూరులోని కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయాల్లో సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. చేడిమాలలోని కామాక్షి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో రాజనేని పిచ్చయ్య నాయుడు కుటుంబ సభ్యులు స్వామి కల్యాణం చేయించారు. చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు దంపతులు స్వామి వారి కల్యాణం జరిపించి అన్నదానం చేశారు.

నాగేశ్వరాలయంలో పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు

సూళ్లూరుపేటలోని నాగేశ్వరాలయంలో పంచాహ్నిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయాన్నే సుప్రభాతసేవ, 108 లీటర్ల పాలతో అభిషేకం చేశారు. కల్యాణ మండపంలో అరుణోదయాభిషేకం, మధ్యాహ్నం తపనోదయ కాలాభిషేకం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. వాకాటి నారాయణరెడ్డి-లక్ష్మీగీత కల్యాణ మండపంలో శివ పార్వతుల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. పాలకమండలి సభ్యులు కే వెంకటేశ్వర్లు, ఓ చెంగమ్మ, జీ భువనేశ్వరి, ఆర్ సూర్యనారాయణ, వీ చంద్రశేఖర్, వీ తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట: సంతానేశ్వరసామి అభిషేకానికి కాళంగినది నుంచి జలం తెస్తున్న భక్తులు



నాయుడుపేట టౌన్ : భూపతేశ్వరస్వామి నగరోత్సవం



రాపూరులో శివాలయం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



దక్కిలి: స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



సాయిసత్సంగ నిలయంలో భారీ శివలింగానికి అభిషేకం చేస్తున్న కోట సునీల్‌కుమార్ స్వామి

నేడు ఎంపీ గురుమూర్తి పర్యటన

చిల్లకూరు : తిరుపతి ఎంపీ గురుమూర్తి, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ శనివారం గూడూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నట్టు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. వాకాడు మండలం నవాబు పేటలో మత్స్యకారులతో సమావేశమవుతారని తెలిపారు. పులికాట్ సరస్సు ముఖద్వారాల పూడిక తీతపై మత్స్యకారుల అభిప్రాయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. అలాగే మొనపాళెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటారని అన్నారు. చిట్టమూరు మండలం బురదగాలి కొత్తపాళెంలో పులికాట్ లేక్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారని వెల్లడించారు. ఆసుపత్రి భవాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. చిల్లకూరు మండలం వరగలిలో రూ.35 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు, రక్షిత మంచి నీటి పథకం పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి విశేష స్పందన

వెంకటగిరి రూరల్ : మహా శివరాత్రి పండగ సందర్భంగా కాశీవిశ్వనాథస్వామి ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మోమిడి ఆయుర్వేద వైద్యశాల, చిట్టేడు హోమియో వైద్యశాల, గూడూరు జీహెచ్‌సీ వైద్యులు కె.శేఖర్, పి.మంజుల, సురేష్, శాన్స్‌గ్రేస్, రవి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సుమారు 600 మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు వైద్యులు తెలిపారు. వైద్య శిబిరం శనివారం కూడా కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది సుబ్రమణ్యం, ప్రసాద్‌రెడ్డి, రాఘవరెడ్డి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా లక్ష్మీ భవాని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె చిట్టమూరు పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై నాయుడుపేటకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు.

కల్కి భగవాన్ పిటిషన్ కొట్టివేతపై హర్షం

తిరుపతి కల్చరల్: కల్కి భగవాన్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కల్కి భగవాన్ పేరుతో విజయకుమార్ ప్రభుత్వ భూములు, వందలాది ఎకరాల డీకేటీ భూములు, అటవీశాఖ భూములను ఆక్రమించి వరదయ్యపాలెం వద్ద ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనికి వ్యతిరేకగంగా కల్కి భగవాన్ పిటిషన్‌ను గత జనవరి 10వ తేదీన కొట్టివేసి ఆశ్రమ యాజమ్యాన్ని ప్రాసిక్యూట్ చేయాలని తీర్పు చెప్పడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ అధికారులు ఆశ్రమ భూమిని స్వాధీనం చేసుకోకపోవడం సమంజసం కాదన్నారు. ఆశ్రమాల పేరుతో దొంగ బాబాలు పుట్టకొస్తూ, దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి ఆశ్రమ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసి, ఆశ్రమ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ హేతువాద సంఘం ప్రతినిధులు డి.కోటేశ్వరరావు, రాంమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

గూడూరు రూరల్ : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో దేవసేనమ్మను అధికారులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు నేడు ఇంటి పనులు చేస్తూనే వివిధ రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని తెలిపారు. మహిళలు స్వతహాగా ధైర్యవంతులని, ఎలాంటి సమస్య వచ్చినా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు నాగరాజు, గోపి, డాక్టర్ శశికుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ నందులాల్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్ యాదవ్, వాసు, మాజీ కౌన్సిలర్ కృష్ణప్రసాద్‌రెడ్డి, ముని, సాయి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరు రెండో పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో బ్యూరో ఆఫ్ సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీవీఎంసీ సభ్యులు కూరపాటి రవీంద్రబాబు, బీసీ సహాయ సంక్షేమాధికారి వెంకటేశు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గాంధీనగర్ సమీపంలో ఉన్న మినీ గురుకులంలో శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్‌యూసీసీ మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించి మహిళా ఉపాధ్యాయినులు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. అలాగే సీపీఎం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా నేతలను ఘనంగా సన్మానించారు.



దేవసేనమ్మను సత్కరిస్తున్న స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, తదితరులు

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలోని జిందాల్ పవర్ ప్రాజెక్టు (సింహపురి యూనిట్)లో శుక్రవారం మహిళా దినోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్లాంట్ హెడ్ సుల్తాన్ మన్సూరీ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన సంప్రదాయంలోనే ఉందన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ హెచ్‌ఆర్ విల్సన్, మ్యాథ్యూ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరి రూరల్ : మండలంలోని టీపీ కండ్రిగ పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం రామచంద్రయ్య, అప్పిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బి వెంకమ్మ, ఆయా లోకేశ్వరి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు విజయమ్మను సన్మానించారు.

ఆశ్రిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో..

సూళ్లూరుపేట : పట్టణంలోని సాయినగర్ ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం ఆశ్రిత చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు ఎం విజయకుమారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కుముదిని అధ్యక్షతన హెచ్ఎం బాల చంద్రశేఖర్ చేతులు మీదుగా 50 మంది నిరుపేద వృద్ధ గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. గిరిజన మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విశ్రాంత ఉపాధ్యాయురాలు జయశ్రీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉష, విజయమ్మ, రుక్మిణి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



చిల్లకూరు : కేక్ కట్ చేసి మహిళా దినోత్సవం జరుపుకుంటున్న కార్మికులు



సూళ్లూరుపేట : మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దాతలు